క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



మాక్లూర్: కల్లెడి గ్రామానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం స్థానిక జీపీ భవన ప్రాంగణంలో వైస్ ఎంపీపీ సుక్కి సుజాత సుధాకర్ పంపిణీ చేశారు. వీరందరు వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకొని సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరై చెక్కులు రావడంతో అందజేశారు. ఉప సర్పంచ్ మనీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్, చిన్న రమేష్, రాజు, మల్లారెడ్డి, సాయిలు, పసుల గంగారెడ్డిలు పాల్గొన్నారు.

నూతన జీపీ భవనాలకు భూమి పూజ



భీమ్‌గల్: దేవన్‌పల్లి, కారేపల్లి, తాళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్యల ఆధ్వర్యంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన కొనసాగిస్తుందన్నారు. రైతు బంధు మండల అధ్యక్షుడు శర్మ నాయక్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు మొయిజ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



భీమ్‌గల్: పట్టణంలో ఈ నెల 16న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, ఎంజే ఆస్పత్రి అధినేత డాక్టర్ మధు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంప్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కో–ఆర్డినేటర్లు పర్స నవీన్, జేజే నర్సయ్య, సంధ్య నగేష్‌లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న 44వ ఉచిత సర్జికల్ క్యాంప్, మల్టీ స్పెషాలిటీ హెల్త్ చెకప్ మెగా క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

బలగం ప్రదర్శన



మాక్లూర్: తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజల ఆచారాలు, జీవన విధానంతో పాటు కుటుంబ బాంధవ్యాలను కళ్లకు కట్టినట్టు తీసిన బలగం చిత్రాన్ని శుక్రవారం రాత్రి సర్పంచ్ శిలారి మంజుల సుధాకర్ ఆధ్వర్యంలో వల్లభాపూర్ గ్రామంలో ప్రదర్శించారు. వృద్ధులు ఈ చిత్రాన్ని తిలకించటానికి భారీగా తరలి వచ్చారు. చిత్రంలో ఉన్న సన్నివేశాలను చూసి పలువురు కంటతడి పెట్టారు.

'బీసీలు అణచివేతకు గురవుతున్నారు'



సుభాష్‌నగర్: రాష్ట్రంలో వెనకబడిన వర్గాలు అన్నిరంగాల్లో అణచివేతకు గురవుతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని 8వ డివిజన్ సాయినగర్‌లో వాడవాడకూ ఓబీసీ – ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మంత్రి వర్గంలో బీసీలకు అవకాశం కల్పించారని, నవోదయ విద్యాలయంలో 27 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. తద్వారా పేద బీసీ విద్యార్థులు లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు ఉపాధి నిమిత్తం సబ్సిడీ రుణాలు కూడా ఇవ్వడం లేదని గుర్తు చేశారు. నాయకులు నాగరాజు, ఇప్పకాయల కిషోర్, గిరిబాబు, మారుతి, శ్రీనివాస్, శ్రవణ్, సుందర్‌సింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- కోటయ్యక్యాంపులో కల్యాణలక్ష్మి, రంజాన్ కానుకల పంపిణీ



డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని: అర్హులైన స్థానిక నిరుపేదలకు మాత్రమే డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. వర్ని మండలంలోని సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కోటయ్య క్యాంపు గ్రామంలో శుక్రవారం 120 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి స్పీకర్ భూమిపూజ చేశారు. అంతకుముందు ముస్లిం మైనార్టీలకు రంజాన్ కానుకలు, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు స్పీకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం జరుగుతున్నదని తెలిస్తే ఇతర ప్రాంతాల వారు ఆయా గ్రామాలకు వచ్చి తాత్కాలికంగా నివాసాలు ఉంటూ తమకు కావాలని వేధిస్తున్నారని, అలాంటి వారికి డబుల్ బెడ్ రూంలు ఇవ్వకుండా అసలైన లబ్ధిదారులకే కేటాయించాలని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్క నిరుపేదకు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే తన లక్ష్యమని, ఇంకా ఎన్ని ఇళ్లయినా మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో గ్రామాల వారీగా అర్హులైన వారి జాబితాను తయారుచేసి తనకు ఇస్తే మరిన్ని ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు దగ్గరుండి పనులు చేయించాలని అప్పుడే నాణ్యతగా పనులు జరుగుతాయని సూచించారు. వర్ని మండల కేంద్రంతో పాటు పాతంగల్‌లో నూతన ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే వాటి నిర్మాణాన్ని ప్రారంభిస్తానన్నారు. బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు, జెడ్పీటీసీ హరిదాసు, తదితరులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి నష్టపోవద్దు



వర్ని: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి రైతులకు సూచించారు. పాతవర్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర చెల్లిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు సాయిబాబా, కనకా రెడ్డి, కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్ నాయకులు వీర్రాజు, గిరి పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



జాన్కంపేట్ ఐబీసీ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

క్రైస్తవులు గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు చోట్ల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. సర్వ మానవాళి కోసం యేసు ప్రభువు మనిషిలా భూలోకానికి వచ్చి పాప విముక్తి కోసం ప్రాణ త్యాగం చేసిన పవిత్రమైన రోజు గుడ్ ఫ్రైడే అని వివరించారు. అనంతరం భక్తులకు శిలువపై గల 7 జ్ఞాన వాక్యాల గురించి వివరించారు. వేల్పూర్, బోధన్, కమ్మర్‌పల్లి పరిధిలోని పలు చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. – వేల్పూర్/బోధన్ టౌన్/కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లి సీయోను చర్చిలో ఏసు ప్రభు సందేశాలు వినిపిస్తున్న పాస్టర్



బోధన్‌లోని సీఎస్ఐ చర్చిలో భక్తులకు జ్ఞాన వాక్యాలను వివరిస్తున్న పాస్టర్లు

బాల్కొండ తై బజార్ వేలం రద్దు

- వారం రోజుల క్రితం 6.25 లక్షలకు దక్కించుకున్న స్థానికుడు
- డబ్బులు చెల్లించకపోవడంతో రద్దు చేసిన అధికారులు
- వేలంపై అధికారుల నిర్లక్ష్యం
- జీపీ ఆదాయానికి గండి



బాల్కొండ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంతకు నిర్వహించిన తైబజార్‌ను జీపీ అధికారులు, పాలక వర్గం రద్దు చేసింది. ఇది వరకే రెండు సార్లు టెండర్ కాకుండానే వాయిదా పడింది. మూడోసారి వేలంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ డబ్బు చెల్లించడం లేదు. గతేడాది వేలంలో ఇదే లొల్లి జరిగింది. గతేడాది కూడా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించలేదు. ప్రస్తుతం కూడా టెండర్ దక్కించుకుని ముందుకు రాకపోవడంతో మొదటికి వచ్చింది. ఇలా చేయడం వల్ల జీపీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

సిండికేట్ కోసమేనా..

తై బజార్‌ను తక్కువకు దక్కించుకోవడానికి మొదటి నుంచి పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కారణంగానే మొదట రెండు సార్లు వాయిదా పడింది. కాంట్రాక్టర్లు అందరూ సిండికేట్‌గా ఏర్పడి జీపీ ఆదాయానికి గండి కొట్టాలన్నదే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది.

" అగ్రిమెంట్‌కు ముందుకు రావడం లేదు

తై బజార్ వేలం దక్కించుకున్న వ్యక్తి అగ్రిమెంట్‌కు ముందుకు రావడం లేదు. దీంతో వేలాన్ని రద్దు చేశాం. సోమవారం మళ్లీ తైబజార్ వేలం నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వేలం నిర్వహిస్తున్నాం.

– రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

భగీరథ నీటి లీకేజీ

- పట్టించుకోని అధికారులు
- వృథాగా పోతున్న నీరు



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో భగీరథ పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడటంతో నీరు వృథాగా పోతోంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పలు చోట్ల కొన్ని రోజులుగా భగీరథ పైపులు లీకేజీలు అవుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. గోల్‌బంగ్లా సమీపంలో, హౌజింగ్ బోర్డ్ పార్క్ మూలమలుపు వద్ద, భాజన్న దర్గా సమీపంలో, పెద్ద బజార్‌కు వెళ్లే దారిలో కొన్ని రోజులుగా పైప్‌లైన్ లీకేజీలు అవుతున్నాయి. నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రతిరోజు మున్సిపల్ అధికారులు కాలనీల్లో పర్యటిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

" మరమ్మతులు చేస్తాం

మున్సిపల్ పరిధిలో భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం. అవసరమైన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల బెడద లేకుండా చూస్తాం.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోవింద్‌పేట్ పీహెచ్‌సీ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, సూపర్ వైజర్ రవీందర్, ఆరోగ్య కార్యకర్తలు ఎస్తేరు రాణి, గణేష్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం




రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయడానికి పల్లెబాట పట్టనున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం బాన్సువాడ సెగ్మెంట్ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి మే 14 వరకు నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో యాత్ర ద్వారా ప్రజల వద్దకు వెళ్తామన్నారు. నాయకులు విఠల్ గౌడ్, ఓమయ్య, దుబాస్ రాములు పాల్గొన్నారు.

రామన్నపేట్ గ్రామస్తులతో అధికారుల చర్చలు

వేల్పూర్: రామన్నపేట్‌లో వీడీసీ, ముదిరాజ్ వర్గీయులకు మధ్య ఏర్పడిన విబేధాలపై శుక్రవారం వేల్పూర్ తహసీల్ కార్యాలయంలో అధికారులు చర్చలు జరిపారు. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు, భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, వేల్పూర్ తహసీల్దార్ రాజేందర్, మోర్తాడ్ ఎస్సై ముత్యం రాజు కలిసి ముదిరాజ్‌లు, వీడీసీ వారితో వేర్వేరుగా మాట్లాడారు. గ్రామంలో ఎందువల్ల ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిందో తెలుసుకున్నారు. ఇరువురి మధ్య భూ సమస్య ఉంటే పరిష్కరిస్తామని, ఎవరూ కూడా భౌతికదాడులకు దిగవద్దని, ఒకవేళ అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాళ్లు కోల్పోయిన మహిళకు చేయూత

– తక్షణ సాయంగా రూ.10 వేలు



మహిళను పరామర్శిస్తున్న సుచరిత

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన చిన్నాపూర్‌కు చెందిన ఒడ్డె లక్ష్మికి పూర్తి స్థాయిలో వైద్యం చేయించేందుకు ఆర్ఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరిత బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి తక్షణ చర్యగా రూ.10 వేల నగదు అందించారు. లక్ష్మికి విరిగిన రెండు కాళ్లు పూర్తిగా తగ్గే వరకు వైద్య ఖర్చులన్నీ భరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్ఆర్ ఫౌండేషన్ ముందుకు రావటం పట్ల లక్ష్మి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే బ్రతుకు దెరువు కోసం సౌదీ వెళ్లిన ధర్మోరా గ్రామానికి చెందిన హన్మాండ్లు 2016లో అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లతో పాటు వెన్నుపూస విరిగి ఇప్పటికీ మంచానికే పరిమితమై ఉంటున్నాడు. ఆయన ఇంటికి కూడా వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులను సంప్రదించి చికిత్స కోసం తగిన సహకారం అందిస్తామని వారికి భరోసా ఇచ్చారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత రామ్ సింగ్

బోధన్‌టౌన్(బోధన్): హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్‌సింగ్ స్పష్టం చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి సభ నిర్వహించారు. ఈ సభకు 108 విరూపాక్ష మహరాజ్(మహారాష్ట్ర), విశ్వేశ్వర పీఠ శ్రీ ప్రణవానంద స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అతిథులు మాట్లాడారు. గోవధ మహాపాపమని, గోరక్షణ చేయడం ప్రతీ హిందువు బాధ్యతని, గోవులను వధించకుండా కాపాడుకోవాలని సూచించారు. లవ్ జిహాద్ అంటే ప్రతీ ఒక్కరికి తెలియాలని అప్పుడే అరికట్టవచ్చని పేర్కొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మోర్తాడ్(బాల్కొండ): బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి భౌతికదాడులకు పాల్పడాలని, బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచిస్తూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. ఏర్గట్లలో మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజాస్వామ్య దేశంలో ఉన్నవారు ప్రభుత్వాలు తప్పు చేస్తే నిరసన తెలియజేయడం తప్పా అని ప్రశ్నించారు. శుక్రవారం ఏర్గట్ల పోలీస్‌స్టేషన్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రం అందించారు. పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ కేసులో ఎవరైనా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తే భౌతికదాడులకు పాల్పడాలని మంత్రి రెచ్చగొట్టడాన్ని తప్పుబట్టారు. నాయకులు మల్కన్నగారి మోహన్, నిమ్మల శ్రీనివాస్, జీవీ నర్సింహారెడ్డి, ఏలేటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

12 రకాల సరుకులు ఉచితంగా ఇవ్వాలి



రాజరాజేశ్వరినగర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



మామిడిపల్లిలో..పీవైఎల్ నాయకులు

కమ్మర్‌పల్లి: రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు సత్తెక్క డిమాండ్ చేశారు. శుక్రవారం రాజరాజేశ్వరీనగర్‌లో ఈమేరకు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేలు చేయడం తప్ప పేదలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యంతో పాటు, గోధుమలు, వంట నూనె, కంది పప్పు, కారం, పసుపు, ఉప్పు, పల్లీలు, చెక్కెర, చాయిపత్తి ఉచితంగా అందించాలన్నారు. వంట గ్యాస్ సగం ధరకే ఇవ్వాలని కోరారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి రేషన్ దుకాణం ఎదుట శుక్రవారం పీవైఎల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో రేషన్ దుకాణంలో బియ్యంతో పాటు వంట నూనె, కిరోసిన్, చింతపండు, పప్పు, కారం, సబ్బులు వంటి సరుకులు ప్రభుత్వాలు ఇచ్చేవని, ప్రస్తుతం బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.

ఇంటింటికి బీజేపీ పోస్టర్ల ఆవిష్కరణ..



బోధన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు



ఆర్మూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): ఇంటింటికి బీజేపీ పోస్టర్లను ఓబీసీ పట్టణ అధ్యక్షులు గుంత గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ బీజేపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ నాయకులు డాక్టర్ శివప్ప, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మపురి, ఓబీసీ మండల అధ్యక్షుడు సాయినాథ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బాలరాజు, నాయకులు రామరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ప్రచారం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఓబీసీ పట్టణ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం 11, 12, 13, 14వ వార్డులలో పల్లె పల్లెకు ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ బీసీలకు చేకూర్చిన ప్రయోజాలను వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కిరణ్, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్ దళిత వ్యతిరేకి'



దళితులతో కలిసి భోజనాలు చేస్తున్న బీజేవైఎం నాయకులు

మోపాల్: రాష్ట్రంలోని దళితులకు అనేక రకాలైన హామీలిచ్చి విస్మరించారని, సీఎం కేసీఆర్ దళిత వ్యతిరేకి అని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేవైఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు నగర శివారులోని బోర్గాం (పి) 5వ డివిజన్ దళితవాడలో స్థానిక ప్రజలతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సందగిరి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏప్రిల్ 7 నుంచి 14 వరకు సేవా పక్షంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో దళిత వాడల్లో స్థానిక ప్రజలతో కలిసి భోజనాలు చేస్తామని తెలిపారు. దళితులను సీఎం కేసీఆర్ కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, దళిత బంధు, దళితుడ్ని సీఎం, దళితులకు మూడు ఎకరాలు, ఇతరత్రా అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. అనంతరం దళిత వాడల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఎర్రం సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమందు విజయకృష్ణ, నాయకులు శివప్రసాద్, బంటు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.